స్త్రీ స్వాతంత్ర్యం

[కథానిక]

'జమదగ్ని'

ఆంధ్రసారస్వతసంఘం కార్యదర్శి ఆడపిల్లలగది దగ్గరకు వెళ్లాడు. కాలేజీబంట్రోతు లోపలికి వెళ్లి చెప్పగా లలిత కర్టెనుదగ్గిరికి వచ్చింది. తక్కిన ఆడపిల్లలుగూడా వచ్చి ఆమెవెనకాలే గుమిగూడారు.

ఇంటర్వలులో ఇళ్లకు వెళ్లని కుర్రాళ్లని ఈ సమావేశం ఆకర్షించింది. కార్యదర్శి అక్కడికి వెళ్తాడని అందరికీ తెలుసును కాబోలు-కుర్రాళ్లందరూ గుమ్మాలలోనే నిలబడ్డారు. కొందరు వరండాలో పచార్లుగూడా ప్రారంభించారు. లలితముఖం కనిపించడంతోటే 'చూడు! చూడు! నాయకురాలు!' 'నాయకురాలు కాదోయ్! ఉపన్యాసకురాలు!' 'నేనంటే కాదన్నావు. ఇప్పుడు తెలిసిందా?' 'దీనికేంగాని కాటుకపిట్ట నెన్నడైనా చూశావ్?' ఇత్యాదివాఖ్యానాలు శరపరంపరగా విజృంభించాయి. వీటిల్లో దురుసువాళ్లు వదిలినవి ఆ గదిదాకా వెళ్తున్నాయి, కొంచెం ఓపిక తక్కువవాళ్లవి సగంసగం సమీపిస్తున్నాయి, తక్కినవి గాలిలో బుసబుసలాడుతున్నాయి.

'ఆడవాళ్లతరఫున ఎల్లుండి డిబేటులో మీరు పాల్గోవాలి' అన్నాడు కార్యదర్శి.

'మనస్ఫూర్తిగానే అడుగుతున్నారా?'

'కాకపోతే ఇందాకా రావడ మెందుకు?'

'నిజమే అనుకోండి. ఇష్టముంటే మేమే పేర్లిస్తాంగదా అని ఊరుకోక వచ్చారు. సంతోషం. కాని ఈ పరిస్థితుల్లో—'

'అందుకనే మీరు తప్పక మాట్లాడాలని నా ఉద్దేశం'

'అంటే మాకు స్వాతంత్ర్యం కావాలని మమ్మల్నే వాదించుకోమంటారు.' అంటూ లలిత చిరునవ్వు నవ్వింది.

కార్యదర్శిగూడా నవ్వుతూ 'ఒప్పుకున్నట్టే గదా!' అన్నాడు.

కర్టెనువెనకాల ఆడపిల్లలంతా 'వద్దు, వద్దు' అని లలితకు సలహా ఇచ్చారు. అయినా ఆమె 'నాపేరు వేసుకోండి' అని చెప్పి 'అనుకూలంగా కాదు, వ్యతిరేకంగా మాట్లాడతాను' అన్నది.

కార్యదర్శి 'మీ ఇష్టం' అంటూ వెనక్కి వచ్చేశాడు. కర్టెనువెనకాల లోపలికి వెళ్లుతూ కనిపించిన పిల్లల్నిగూర్చి, నవ్వుతూవస్తున్న కార్యదర్శినిగూర్చి కుర్రాళ్లు రకరకాలుగా చెప్పుకుని సంతోషంతో విరగబడిపోయారు.

అంతలో ఒకటిమ్ముప్పావయి మధ్యాహ్నంకాలేజికి మొదటిగంట కొట్టారు. అంతవరకూ గదికి పది పదిహేనుమంది కంటే ఎక్కువ లేని కుర్రాళ్లు ఇప్పుడు వాళ్లవాళ్ల తరగతిప్రమాణాన్నిబట్టి అరవైలు డెబ్భైలుగా పెరిగిపోయారు. గదులు, వరండాలు, దార్లు-అన్నీ కుర్రాళ్లమయమే. గంట కొట్టడంతోటే ఇంతమంది కుర్రాళ్లు ఒక్కచోట చేరుకోవడం చూస్తే ఎండాకాలమంతా ఎక్కడెక్కడో దాక్కుని వాన కురవడంతోటే ఒక్కసారి బైటికివచ్చే కప్పలగుంపులు జ్ఞాపకం వస్తాయి. అందులో అందరూ పదిహేను, ఇరవైయేళ్ల నడిమి వయసువాళ్లే అవడంచేత శరీరాల్లో పొంగుతున్న

వేడినెత్తురుకు తగిన పని లేక వాళ్లు చేసే నానావిధ వ్యక్తావ్యక్తధ్వనులూ దూరంనుంచి ఆలకిస్తే లయ లేకయినా ఆ బెకబెకలకు సమానంగానే ఉంటాయి. కుర్రాళ్లే కాదు, ఈరోజుల్లో అంతమంది పెద్దవాళ్లు కూడినా అంతే!

కొంచెంసేపట్లో రెండోగంట కొట్టడం మొదలు పెట్టారు. అన్నిగదుల్తోపాటు ఇంటర్మీడియేటు మూడో గ్రూపుతరగతిగదికూడా కిటికీలలోనుంచీ, గుమ్మాలలోనుంచీ కుర్రాళ్లు గబగబా లోపలికి దూకిపోగా బైలుదేరబోయేముందు యమ్. యస్. యమ్. రైల్లో మూడోతరగతిపెట్టెలా ఒక్కమాటు కిటకిటలాడిపోయింది. గాలరీలో కిటికీలదగ్గర కూర్చుని లెక్చరరు వచ్చి అటెండెన్సు వేసుకోవడంతోటే జారిపోదామనుకుంటున్న వాళ్లనుఅప్పుడే కిటికీలలోనుంచి లోపలికి వచ్చినవాళ్లు జరగమంటుంటే వాళ్లు జరగడం లేదు. అంచేత అల్లాంటివాళ్లు బూటుకాళ్లతో బల్లలమీద నడుస్తూ ఖాళీచోట్లకు ప్రయాణం చేస్తున్నారు. ముందు వరసలో కూర్చున్న ఒక కుఱ్ఱాణ్ని వెనకవరసలో మిత్రుడు కేకేస్తే చుట్టు తిరిగి ఎవడుపోతాడని వాడు బల్లలమీదినుంచి దేకుతూనే పైకి వెళ్లిపోతున్నాడు. కొందరు తమ పుస్తకాలు ఒకచోట్లో పడేసి ఎక్కడికో వెళ్లి మళ్లీ వచ్చేటప్పటికి అవి అక్కడ కనబడక వాటికోసం వెతుక్కుంటూ వాణ్నీ వీణ్నీ అడిగి వాళ్లు తమకు తెలియదని దబాయిస్తుంటే చేసేదిలేక తిట్టుకుంటూ, తిట్లు తింటూ తిరుగుతున్నారు. ఇంకా లెక్చరరు రాలేదే, అని కొందరు కుర్రాళ్లు పైనుంచి కిందిదాకా ఉన్న బల్లల కూర్పుమీద ఊతంగా నడిచి ధ్వని చేసుకుంటూ గుమ్మముదాకా పోయి 'వస్తున్నాడు, వస్తున్నాడు' అని క్లాసును హెచ్చరించి తమాషాచేసి సంతోషిస్తున్నారు. ఎంతైనా ఇల్లాంటి కాయిక వ్యాపారాలకంటే ఆగదిలో వాగ్వ్యాపారమే అధికంగా ఉంది. తక్కినవాళ్లంతా నిశ్శబ్దంగా ఉండి తనమాట పక్కవాడికి వినిపించాలని తొంభైతొమ్మిది మంది యువకులు ఎవరికివారు ప్రయత్నిస్తూ ఉంటే అక్కడ ధ్వనికాక మరెక్కడవుతుంది? దూరంనుంచి అక్కడి ధ్వని అర్థంకాదుగాని దగ్గరకుపోయి వాళ్లల్లో ఒకరుగా ఉండి వింటే 'ఆ పుస్తకం ఇటివ్వరా!' 'బలే గ్రేడు తిన్నాడురా', 'ఏడిశావు ఉండవోయ్!', 'ఏదేది! బలేపోజు, బలేపోజు!', 'చల్, చల్, రే, నవజవాన్', 'కాదురా. గుర్రమే వెనకాలొస్తోంది. అది కనిపెట్టి వెళ్తూవెళ్తూ ఉన్న రామంగాడు ఠక్కున ఆగిపోయాడు. ఇంకేముంది— 'మెట్టవంకాయ వెళ్లిపోతున్నాడటరోయ్', 'ఈ వెన్నెలరేయీ హాయీ', 'ఏంచేస్తేమాత్రం ఫూ లంటాడా వాడు!', 'నువ్వేమన్నా అను. క్లాసంటే పరమాన్నంగాడి క్లాసే క్లాసు,' 'అదేం పత్తిత్తు అనుకున్నావా ఏమిటి?' ఇల్లాంటి సందర్భపూర్వకవ్యాఖ్యలువ్రాస్తేనేకాని అర్థంకాని వాక్యాలు కొల్లలు కొల్లగా వినిపిస్తాయి. ఏమయితేనేం, మొత్తమ్మీద ఆగదిలో ధ్వనినిబట్టే వీధిలో పోయేవాళ్లకు అది కాలేజి అని తెలుస్తోంది.

అంతలో లెక్చరరు బయలుదేరా డన్న సూచన వచ్చింది. గదిలో ధ్వని ఇంకా తగ్గలేదుకాని రైలు కదుల్తున్నప్పుడు ఎక్కడమే ఫాషనయినట్లు వస్తున్న ఉపాధ్యాయుణ్ని చూచాకే క్లాసులోకి వెళ్ళాలని వరండాలో తిరుగుతున్న కుర్రాళ్లుమాత్రం లోపలికి వెళ్లారు. దాంతో లోపలి రొద ఒకవిధంగా తగ్గింది. మరోకవిధంగా అక్కడివాళ్ళిక్కడికీ, ఇక్కడివాళ్ళక్కడికీ చోట్లు మారడంవల్ల హెచ్చింది.

ఆ స్థితిలో ఉన్న ఆ గదిలోకి లెక్చరరు వెళ్లాడు. చోటుకోసం వెతుక్కుంటూ నిలబడిఉన్న కుర్రాళ్లతో ఉపాధ్యాయుడు వచ్చా డని గౌరవంతో నిలబడ్డ విద్యార్థులు కలిసిపోయి అది గౌరవమో అగౌరవమో తెలియకుండా పోయింది. వెళ్లినవాడు వెళ్లినట్టుగా లెక్చరరు వేదికమీద నిలబడే ఉన్నాడు. అప్పటికి కుర్రాళ్లంతా కూర్చున్నారుగాని గుసగుసలుగా రొదమాత్రం సాగుతూనే ఉంది. ఆలోగా ఆడపిల్లలు వరసగా క్లాసు దగ్గరికి వెళ్లారు. వాళ్లకోసం ఖాళీగా ఉన్న మొదటి వరసబెంచీలో ఒక్కొక్కరే కూర్చుంటూఉంటే వెనకనుంచి వినపడీవినపడకుండా, వ్యక్తి తెలియకుండా ఏవేవో విసురుమాటలు గాలిలో బుస్సుబుస్సుమంటూనే ఉన్నాయి.

లెక్చరర్ ఒక్కసారి బల్లకొట్టి నంబర్లు పిలిచి అటెండెన్సు వేసుకున్నాడు. లేనివాళ్లకు ఉన్నవాళ్లు చెప్తున్నా, చెప్పినవాళ్లు జారిపోతున్నా ఆ లెక్చరరు అష్టావధానం చెయ్యలేడుకాబట్టి విధిమాత్రం సాగిపోతూనే ఉంది. చివరకి పదినిమిషా లయాక ఒక్కమాటు క్లాసువంక నాలుగుమూలలా చూచి పలచబడ్డ స్థానాలు కనిపించినప్పటికీ వ్యక్తులు తెలియకా, తెలిసినా ఏమీ చెయ్యలేకా ఆయన చెప్పవలసిన పాఠం ఆయన మొదలు పెట్టాడు.

అప్పటికికుర్రాళ్ల గుసగుసల ధ్వనికూడా చాలా భాగం తగ్గిపోయింది. ఇంకా ఏ కొంచెం మిగిలిఉన్నా అది లెక్చరరు గొంతులో అణిగిపోయి బైటికిమాత్రం తెలియడం లేదు. అంచేత పాఠం హాయిగా సాగుతోంది. వినేవాళ్లు వింటున్నారు. తమకు తెలియనివి వ్రాసుకునేవాళ్లు వ్రాసుకుంటున్నారు. పాఠ్యపుస్తకాలవంక చూస్తున్నట్లు నటిస్తూ మధ్య పెట్టుకున్న సినిమా వగైరా అభిమానపత్రికల్ని చదువుకునేవాళ్లు చదువుకుంటున్నారు. వెనకవరసల్లో ముందువాళ్ల వీపులను అడ్డంచేసుకుని తలవాల్చి నిద్రపోతున్న వాళ్లను ఎవరూ పలకరించడంలేదుగాని వాళ్లను చూసీ, లెక్చరరువంక చూసీ కొందరు ముసిముసినవ్వులతో కనపడీ కనపడకుండా బాధపడుతున్నారు.

ఇంకో పావుగంట గడిస్తేనేగాని ఆ పిరియడు కాదు. అంతలో ఆడపిల్లల్లో ఏదో అలజడి బయలు దేరింది. లెక్చరరు వాళ్లవంక హెచ్చరికగా ఒకమాటు చూసేసరికి వాళ్లు మళ్లీ వ్యగ్రులై పుస్తకాలవంక చూస్తూ ఉండిపోయారు. కాని మరునిమిషంలో లీల ఛట్టున లేచి బైటికి వెళ్లిపోయింది. ఆమెవెంబడే వెళ్లాలని లలితగూడా లేచింది. లెక్చరరు ఆదుర్దాగా 'ఏమిటేమి' టన్నాడు.

క్లాసంతా సూది వేస్తే చప్పుడయ్యేంత నిశ్శబ్దంగా ఉంది.

లలిత కాయనమాటలు వినిపించాయో లేదో ఆమెగూడా వెళ్లిపోయింది.

సంగ తేమిటో తెలియక లెక్చరరు నిర్ఘాంతపోయాడు. ఆయనకు జరిగిన పరాభవానికి హర్షసూచకంగా క్లాసులో మగపిల్లలంతా గొల్లుమన్నారు. లెక్చరరుకు నిజంగా కోపమే వచ్చింది. కాని క్లాసంతా కలిసి చేసిన పని నలుగురి మాట చెల్లే రోజుల్లో తప్పెల్లా అవుతుంది ? ఆయన ఏమీ చెయ్యలేక అంత కోపాన్నీ దిగమింగుకుని 'మీరుకూడా వెళ్లం'డని తక్కిన ఆడపిల్లల్ని పంపించేశాడు.

మళ్లీ గొల్లుమన్నది క్లాసు. లెక్చరరుకు మళ్లీ కోపం వచ్చింది. ఈసారి చెయ్యగలిగిం దేదో చేద్దామనే అనుకున్నాడు. కాని అంతలో బెల్లు కొట్టేశారు. లెక్చరరు ఇంకా అక్కడ నిలబడిఉండగానే ఆయన దారి నడ్డగిస్తూ కుర్రాళ్లు తలకొకదారిచొప్పున దాటిపోయారు.

౨

లీల క్లాసులోనుంచి సరాసరి ప్రిన్సిపాలుగది దగ్గిరికి వెళ్లింది. ఆయ నప్పు డదృష్టవశాత్తూ ఖాళీగానే ఉన్నారు.

బొటబొట కన్నీళ్లు కారుస్తూ ఎగరొప్పుకుంటూ లోపలికి వచ్చిన లీలను చూచి ప్రిన్సిపాలు కంగారుపడిపోయాడు. ఆయన సంగ తేమి టని అడగనైనా లేదు. లీలే రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ "నాకు టి. సి. (ట్రాన్స్ఫరు సర్టిఫికెట్టు) ఇచ్చెయ్యండి. నేను వెళ్లిపోతాను" అన్నది రుద్ధకంఠంతో.

ఈ మాట కాశ్చర్యపడి 'కాసేపు స్థిమితంగా కూర్చుని సంగ తేమిటో చెప్పమ్మా' అన్నాడు ప్రిన్సిపాలు.

లీల కూర్చోలేదు. అంతలో లలితగూడా అక్కడికి వచ్చేసింది.

'ఏమిటమ్మా ఇది ?'

లీలచెయ్యి పట్టుకుని ఒక కుర్చీలో కూర్చోపెట్టి తాను పక్కన నిలబడిఉండే లలిత చెప్పింది.

వాళ్ల క్లాసులో ఆడపిల్లల బెంచివెనకాల ముగ్గురే ముగ్గురు కుర్రాళ్లు కూర్చున్నారు. ఎవరి కాలో తెలియ లేదుగాని మొదట్లో లలితకు తగిలింది. ఆమె వెంటనే వెనక్కి తిరిగి చూచింది. కుర్రాళ్లు ముగ్గురూ ఏమీ ఎరగనట్టు తమ పుస్తకాలవంక చూచుకుంటున్నారు. వాళ్లు కృష్ణమూర్తీ, రామారావూ, వెంకటరమణా అయినట్లు లలిత కప్పుడు తెలిసింది. అందులో ఆమె వెనకాల ఉన్నవాడు రామారావు. అప్పటినుంచీ లలిత ఒకకంట వాళ్లను కనిపెడుతూనే ఉన్నది. కాసేపట్లో వెంకటరమణ — బెంచిమొదట్లో కూర్చున్నవాడు — లేచి ఉమ్మేసుకోడాని కన్నట్లు బైటి కెళ్ళిపోయాడు. అతను వెళ్లడంతోటే రామారావు పక్కకి జరిగాడు. ఇప్పుడు రామారావు లీలవెనకా, కృష్ణమూర్తి లలిత

వెనకాలా అయ్యారు. ఆ తర్వాత రామారావు మాటిమాటికీ కాలు కదిలిస్తూనే ఉన్నాడు. అది లీలను తగులుతూనేఉన్నది. ఆమె ఉలిక్కిపడుతూనేఉన్నది. ఇది గమనిస్తున్న లలిత వెనక్కి తిరిగి ఎన్నిసార్లు గుడ్లురిమి చూచినా లాభం లేకపోయింది. లెక్చరరు తన దారిని తాను పాఠం చెప్పుకుపోతున్నాడేకాని ఈ సంగతు లేమీ గమనించడంలేదు. ఇంతలో లలిత జరుగుతున్న సంగతి తనకు రెండోపక్కనున్న శారదతో మెల్లగా చెప్పింది. ఆమె తన పక్కనున్న కామేశ్వరితో చెప్తోంది. అప్పుడు లెక్చరరు వీళ్లవంక చూచాడు. వీళ్లు తమతమ పుస్తకాలవంక చూస్తూ తలలు వంచుకున్నారు. లెక్చరరుపాఠం సాగుతూనే ఉంది. అంతలో వంచుకున్న తల ఎత్తుకోవలసినంత బలంగా లీలజడ లాగబడింది. దాంతో ఆమె ఇలా పరుగెత్తుకు వచ్చింది. ఈ సంగతి ఇంత స్పష్టంగా చెప్పుకోలేదేమో అని లలితగూడా ఆమెవెంబడే వచ్చింది.

అదీ జరిగిన సంగతి!

జాగ్రత్తగా ఈ సంగతంతా విన్న ప్రిన్సిపాలు మనసులో చాలా బాధపడ్డాడు. ఆమె చెప్పినదాన్ని బట్టి రామారావు దోషి అని స్పష్టంగా తెలుస్తోంది. అట్లాంటి వ్యక్తి కాలేజీలో ఒక్కడున్నాసరే అది ఆసంస్థగౌరవానికే గొడ్డలిపెట్టు. అంతే కాదు. సరళవ్యవహారానికే తీవ్రప్రతిబంధకం. ఇంక కాలేజిలో డిసిప్లిన్‌కే నీళ్లు వదిలెయ్యవచ్చు. వాణ్ని టి. సి. ఇచ్చి పంపించడమే కాదు, మళ్ళీ ఏ విద్యాసంస్థలోనూ చేర్చుకోగూడ దని వ్రాసెయ్యాలి.

మనసులో అంత తీవ్రనిశ్చయం చేసుకున్నా ప్రిన్సిపాలు బైట కా భావం ప్రకటించలేదు.

‘అయితే ఎవడు చేశా డంటా రీ పని?’

‘ఇంకా అనుమాన మెందుకండీ? ఆ రామారావే!’

‘వాణ్ణిగురించి వెనకగూడా ఇల్లాంటి కంప్లెయింట్లున్నాయికదూ!’

‘నేనే ఇదివర కొకమాటు తమతో చెప్పానండి. మేము ఇంటికి పోతూ ఉంటే వాడు మా వెనకాలే వస్తూ ఉంటా డనీ, ఒక్కొక్కప్పుడు చెకచెకా మా కంటే నాలుగడుగులు ముందుకు పోయి మా దారి కడ్డుగా నడుస్తూ ఉంటా డనీ, మారుపేర్లు పెట్టి పిలుస్తూ ఉంటా డనీ, తన స్నేహితు లందరితోనూ కలిసినుంచుని కాలేజీలో మమ్మల్ని చూచినప్పుడల్లా ‘ఘుప్పు ఘుప్పున ఉమ్మేస్తూ ఉంటా డనీ చెప్పాంగని అల్లాంటి వన్నీ పట్టించుకోగూడ దని మీరే మమ్మల్ని కోప్పడ్డారండి!’

‘అవునవును జ్ఞాపకం ఉంది. వాడే ఇందాకా మితిమీరిపోయా డన్నమాట!’

‘అవునండి. కాస్తాకూస్తానా! మాకు కాలేజికి రావడమంటేనే భయంగా ఉంటోందండి.’

‘అల్లా భయపడిపోతే ఎల్లాగమ్మా!’

‘ఏం చెయ్యమంటారు చెప్పండి? అడుగడుక్కీ అవమానమే అవుతూ ఉంటే ఎన్నాళ్లని తోసేసుకు తిరిగేది? ఊరుకున్నకొద్దీ వాడు రెచ్చిపోతూఉండె. అదుపులో పెట్టేవాళ్లు లేకపోయె. నలుగురితోనూ చెప్పుకుందా మంటే సిగ్గుతో కుమిలిపోవలసివచ్చే విషయమాయె!’

‘మీరు అనవసరంగా బాధపడక హాస్టలుకు వెళ్లండి. నేను వాణ్ని గూడా పిలిచి కనుక్కొని, నలుగురితోనూ సంప్రదించి వెయ్యాల్సిన శిక్ష వేస్తాను. సరేనా!’

‘అలా అంటా రని మేము భయపడుతూనే ఉన్నాం. ఇప్పటికే కాలేజి అంతా ఈ సంగతి చెప్పుకుంటూ ఉంటుంది. ఇక నలుగురితోనూ సంప్రదించడం అంటే మమ్మల్ని మరింత అల్లరి చెయ్యడమే కాని మరో ప్రయోజనం ఏమీ ఉండదు. ఆ బాధమాత్రం తమ కెందుకు? మాకు టీ. సీ. లు ఇచ్చి పంపించెయ్యండి. మే మిద్దరమూ వెళ్లిపోతాము.’

‘అంత ఉద్వేగం పనికిరాదమ్మా. ఏ పనికైనా కాస్త స్తిమితంగా ఆలోచించాలి. వాణ్ని శతవిధాల పంపించేస్తాను. ఒకవేళ పడదూ, మీకు టీ. సీ. లు ఇస్తేమాత్రం ఏం చేస్తారు? మరోవూరు పోయయినా చదువుకోవాలిగాని ఈమాత్రందానికి మానెయ్యరు గదా! అక్కడయినా ఇల్లాంటివాళ్లుండరని నమ్మకమేమిటి? ఈ రోజు లల్లాంటివి. వాటినిబట్టే మనమూ సద్దుకుపోవాలి. అంచేత నా మాట నమ్మి ఇదేమీ జరగలే దనుకుని మామూలుగా ఉండండి. రెండుమూడు రోజుల్లో వాడి సంగతి నే తేలుస్తాను.’

ప్రిన్సిపాలు ఇల్లా అంటుంటే లలిత కెక్కడలేని ఉద్వేగమూ వచ్చింది. లీలకళ్లు బాష్పతటాకపుతూములే అయ్యాయి. ఇకక్కడ ఉండలేక ఆమె లేచి వెళ్లిపోయింది. లలితగూడా ప్రిన్సిపాలుదగ్గర లాంఛనంగా సెలవు తీసుకుని ఆమెవెంట వెళ్లింది.

3

లీల ఆ సాయంత్రం భోజనం చెయ్యలేదు. రాత్రి నిద్రపోలేదు. ఏడ్చిఏడ్చి ఉబ్బిన ఆ మెకళ్లు తెల్ల వారేసరికి నీటి చుక్క లేకుండా ఇగుర్చుకుపోయి ఎండిన వరుగుల్లా వాడి, వత్తలయ్యాయి. కారిన కన్నీళ్లు ముఖాన చారికలుకట్టి, ఎఱ్ఱమట్టితోనూ సుద్ద తోనూ పెట్టిన చారలతో కలకలలాడే పల్లెటూరి పాత కాలపుటింటి ప్రహరీగోడ, వాన వచ్చి కడుక్కుని పోగా, వెలవెలబారినట్టయింది. ఆముఖంతో, ఆ కళ్లతో పొద్దున్న లేచింది లేచినట్లు వెళ్లి కుర్చీలో కూర్చుని. అరచేతుల్లో ముఖం పెట్టుకుని, మోచేతులు బల్లమీద ఆన్చి, ఎదురుగా ఉన్న తెల్లగోడవంక శూన్యదృక్కులు ప్రసరిస్తూ అల్లా ఉండిపోయింది లీల.

లలిత వచ్చి బతిమాలింది, బుజ్జగించింది, ధైర్యం చెప్పింది. అయినా లీల తేరుకోలేదు. ఆమె మనస్సు అంత కలుషితమైపోయింది. ఆ మనోజలం తేరుకోవాలంటే ప్రతీకారకతకగంధం కావాలి. అంత వరకూ ఆమెకు శాంతి లేదు.

తొమ్మిదయింది. హాస్టలులో విద్యార్థినులందరూ భోజనాలకు వెళ్తున్నారు. లలిత వచ్చి లీలను రమ్మన్నది. కాని లీల కదలలేదు. పైగా లలితను వెళ్లిపొమ్మన్నది. నెచ్చెలిస్వభావం తెలిసిన లలిత వెళ్లక తప్పిందికాదు.

తర్వాత వత్సలమ్మగారుగూడా వచ్చారు. ఆవిడ ఆడపిల్లల హాస్టలుకు డిప్యూటీలేడీవార్డెను. జరిగిన సంగతంతా నిన్న సాయంకాలానికే తెలిసినా ఈ పిల్లలు వచ్చి తనతో చెప్పకోకముందే తాను వెళ్లి వాళ్లను పలకరించడం భావ్యం కాదన్న మిథ్యాగౌరవ భావంతో ఆవిడ రాత్రంతా ఊరికేనే ఉండిపోయింది. కాని లీల రాత్రి భోజనం చెయ్యలేదనీ, ఈ పూట గూడా భోజనానికి రానన్నదనీ తెలిసేసరికి కీడెంచి మేలెంచమని ఇది మరేవిధంగానైనా పరిణమిస్తే తన బాధ్యత తాను నిర్వహించలేదన్న దోషం బైటపడు తుందేమో అనే భయంతో ఇప్పటికీ లీలగాని, లలిత గాని తనతో వచ్చి చెప్పకపోయినా తానే లీలదగ్గరకు వెళ్లింది. లీలా లలితల కావిడతో చెప్పకోగూడదనే భావం ఏకోశానా లేదు. అసలు సంఘటన జరిగినప్పుడు ఆ ఉద్వేగంలో లీల కావిడవిషయం జ్ఞాపకమే రాలేదు. ఆవిడతో చెప్పినా ఆమె వెళ్లి ప్రిన్సిపాలుతో చెప్పవలసిందే కాబట్టి ఈ దశాక్రమం తోచకపోయినా తానే ప్రిన్సిపాలుదగ్గరకు వెళ్లి పోయింది. ఆమెవెనక వెళ్లిన లలితకు ఈవిడతో చెప్పడం మంచిదని స్ఫురించినప్పటికీ అప్పుడామె మరోక్లాసులో పాఠంచెప్పతూ ఉండడంచేత వీలు కాలేదు. ప్రిన్సిపాలుతో మాట్లాడడం వాళ్ల మనస్సుల్ని మరింత పాడుచేసింది. ఆవెంటనే వాళ్లు హాస్టలుకు వెళ్లిపోయారు. తర్వాత లీలను ఓదార్చడంతోనే లలితకు సరిపోయింది. రాత్రి తెల్లవార్లూ వాళ్లకు నిద్రలే లేవాయ్. ఇంక చెప్పడానికి వ్యవధేదీ ?

ఏమయితేనేం, ఆవిడ లీలను పలకరించి, జరిగిన దానికి విచారం ప్రకటించి, అయాచితంగా తన సహాయాన్ని వాగ్దానంచేసి దుఃఖపడవద్దనీ, ఇలా అన్నం మాని కూర్చోవడం మంచిది కాదనీ ఎంతెంతో చెప్పింది. హృదయం కలిసిన స్నేహితురాలు లలిత చెప్పితేనే వినని లీల కేవలం విధినిర్వహణంకోసం ఆవిడ చెప్పినంతమాత్రంతో ఏమి వింటుంది ? చివరకు లాభంలేక తన విధి తాను నిర్వర్తించానన్న తృప్తితో ఆమె వెళ్లిపోయింది.

లీలమాత్రం అల్లాగే కూర్చుని తన మనస్సును తవ్వుకుని తవ్వుకుని దుఃఖాన్ని తిరగదోడుకున్నది.

ఆమె ఏమంత అందగత్తె కాదు. పైగా నల్లగా ఉంటుంది. కాని ఆమెకళ్లల్లో వెన్నెలవెలుగు లున్నాయని లలిత అంటుంది. ఆ వెలుగులే తన బావకు తానంత ప్రియతమ కావడానికి హేతువేమో ! అతను మదరాసులో డాక్టరుపరీక్షకు చదువుతున్నాడు. ఈ సంగతి అతనికి తెలిస్తే ఏమనుకుంటాడో ? అమాంతం వచ్చి ఆవెధవని నాశనంచేస్తాడంటుంది లలిత. కాని అతనికి అసలుసంగతి తెలుస్తుందా ? లోకంనోట్లోపడి తారుమారై అసహ్యంగా వినిపిస్తుంది. దాంతో అతనికి కోపం వస్తుంది. తన ఆశలూ, ఎంతెంతో కష్టపడి డబ్బు పంపిస్తున్న తండ్రిఆశలూ మూలముట్టుగా తెగిపోతాయి. తానే ఈసంగతి వ్రాసుకుంటే ? ఏమని వ్రాయడం ? చేతు లెల్లా వస్తాయి ? అయినా, ఏదో గాలిపుకారు వస్తే నమ్మేవాడు తాను వ్రాసుకున్నంత మాత్రంతో ఆ పుకారు తోసేస్తాడని నమ్మకమేమిటి? తన బావ అసలల్లాంటి మాటలు నమ్మనేనమ్మడు. అతనికి తానంటే అంత విశ్వాసం, అంత ప్రేమ. ఈఊరు వచ్చి, ఇన్ని కష్టాలూపడుతూ, ఇన్ని అవమానాలూ భరిస్తూ ఈ చదువంతా చదువుతున్నది దేనికి ? సాధ్యమైనంతవరకూ అతనికి తగిన భార్య కావాలనే కదా !

పరమపవిత్రమైన ఈ ప్రయత్నపథంలో వీడొకడు భూతంలా పట్టుకుని వెనక్కి లాగుతున్నాడు. ఊరుకున్నకొద్దీ భూతానికి లొంగిపోవడమేకాని దాన్ని జయించడం పడదు. అంతే కాదు, తక్కిన రూపుకట్టని భూతాలు గూడా రెచ్చిపోయి బ్రహ్మరాక్షసులవుతాయి. ఇల్లా పడిఉండడంవల్ల మరేప్రయోజనమూ ఉండదు. ఎదురు తిరగాలి, దెబ్బతియ్యాలి. ఎంతటి భూతమైనా దెబ్బకు జడిసితీరుతుంది. కాకపోతే తల్లీ, తండ్రీ, అయినవాళ్లూ దగ్గరలేరుకదా అని కాలేజిలో అడుగుపెట్టిన ప్రతిచవటకూ ఆడపిల్లలంటే ఇంత చులకనతనమా ? కదిలితే హేళన, మెదిలితే అపహాస్యం! ఆ జడ వేసింది, ఈ చీర కట్టింది, అల్లా కూర్చుంది, ఇల్లా కూర్చుంది అంటూ ప్రతిపిల్లనుగూర్చీ వ్యాఖ్యానాలేనాయ్! ఎన్ని పురాలువేసినా ఎంతమాత్రమూ మారని ఎలుగ్గొడ్డుముఖాలూ, కోతిముఖాలూ వేసుకున్న ప్రతికుర్రాడూ మాఅందాలను చూచి ఎగతాళి చెయ్యడమేనాయ్. కాలేజిలో అడుగుపెడితేసరి మరోమాటే వినిపించదు. నల్లగాఉంటే గాస్‌లైటు, పౌడర్ వేసుకుంటే డబుల్‌కోటింగు, చకచకా నడిస్తే చలాకీగుఱ్ఱం, తల వంచితే వంతెన; ఎత్తితే ఎక్స్ట్రా). పోనీ, అనుకుంటే అనుకున్నారు, మనమేం చెయ్యగలమని చెవులుమూసుకుని ఊరుకుంటే వీటి నన్నింటినీ గోడలమీద కెక్కించి వాటిపక్కన అసలు పేర్లు వ్రాయడమాయ్. అంతటితో ఆగినా ఎల్లాగో భరించవచ్చు. అదంతా వ్యక్తిగతమని ఊరుకుంటాం. కాని ఇదేమిటి ? బాగా చదివే కుర్రాడితో మాట్లాడితే వాడితో స్నేహం, మంచిమార్కులు తెచ్చుకుంటే ఇచ్చిన మాస్టరుతో స్నేహం. ఛీ, ఛీ, ఛీ! స్త్రీకి ఇంతకన్నా దుర్భరావమానం ఇంకేముంటుంది? మానంగల యువతి ఈపరిస్థితుల్లో కాలేజీలకు వచ్చి ఏం చదువుకుంటుంది? దీని కెక్కడైనా అంతంటూ ఉన్నదా! చచ్చినజాతిలో పుచ్చుపురుగులు పుట్టి అసలే అంతంతగా ఉన్న హద్దుగోడల్ని చెదలుతిన్నట్లు తింటున్నాయి. మీరిమీరి ఆ పురుగులు గోడల్ని దాటుతున్నాయి. పురుగును పురుగుగానే చూడాలిగాని పురుషుణ్ణిగా చూడకూడదు.

లలిత అప్పుడే భోజనం చేసివచ్చి 'నేను కాలేజికి వెళ్తున్నాను, లీలా' అన్నది.

చటుక్కున మెలకువ వచ్చినట్లు లేచి 'నేనూ వస్తున్నా'నంటూ లీలకూడా అల్లాగే బయలుదేరింది.

౪

ఆపూట కాలేజి అధికారసంఘంవారు నిన్న మధ్యాహ్నం జరిగిన సంఘటనను గూర్చి ఆ సాయంత్రమే ఆరంభించిన తర్జనభర్జనలను కొనసాగిస్తున్నారు. ఆ సంఘంలో ప్రిన్సిపాలూ, వత్సలమ్మగారూ కాక ఇంకా అయిదుగురు సభ్యులున్నారు. వాళ్లల్లో ముగ్గురు తమ అనుభవాన్ని బట్టి రామారావు వస్తుతః అంత చెడ్డవాడు కాదని వాదిస్తున్నారు. 'ఒకప్పుడు మంచివాడే కావచ్చు. ఆమాట నేనూ కాదనను. అయినా ఇప్పుడీపని చేశాడు. అంచేత, ఈ దుష్టత తాత్కాలికమే అయినా దీనికి తగిన శిక్ష వెయ్యకపోతే కాలేజీ పాడైపోతుంది' అని ఒకాయన అంటున్నాడు. 'రామారావు మొదటినుంచీ దుర్మార్గుడే. చిన్నప్పటినుంచీ వాడిసంగతి నాకు తెలుసు. చేర్చుకునేటప్పుడే వాణ్ణి వద్దండీ అని నేను చెప్పాను. అయినా అప్పటి ప్రిన్సిపాలు నామాట కాదని పట్టి కులాభిమానంతో చేర్చుకున్నాడు. నేనే ప్రిన్సిపాలునయితే వాణ్ణి ఈకాలేజిలోకి రానిచ్చేవాణ్ణే కాదు' అంటున్నాడు మిగిలిన పెద్దమనిషి. ఫలితం ఏమయినా తనకేమీ ఇబ్బందిలేనట్టు మేర్యాదకి ప్రిన్సిపాలుకు తానుగూడా ఫిర్యాదుమాత్రం ఇచ్చి ముభావంగా కూర్చున్నది వత్సలమ్మ.

ఆడపిల్లల తరఫున వాదించవలసిన ఆవిడ అల్లా ఉండి, తక్కిన నలుగురూ నాలుగువిధాలా అంటుంటే ఏంచెయ్యాలో తోచక ప్రిన్సిపాలు బాధపడుతున్నాడు. తోటి పెద్దఉద్యోగులు ముగ్గుర్ని వ్యతిరేకించి వ్యవహరించడం అంత భావ్యం కాదు. అల్లా అని అంత దుష్టంగా ప్రవర్తించినవాణ్ణి ఏమీ చెయ్యకుండా ఊరుకోవడానికీ మనస్కరించడంలేదు. సంఘంలో ఉన్నవాళ్లందరూ అయినపని చాలా చెడ్డదని ఏకీభవిస్తూనే ఉన్నారు. కాని రామారావును శిక్షించడందగ్గరమాత్రం ముగ్గురూ కూడిరావడం లేదు. అందరూ ఒక అభిప్రాయంతో ఉంటే ఆయన పని తేలికయిపోయేది. కాని అది సృష్టిలోనే అసంభవం.

అంతలో రామారావును శిక్షించకూడదనే వాళ్లల్లో ఒకరు బైటికి వెళ్లి, అతని తండ్రితో మాట్లాడి, లోపలికి వచ్చి, ఒక విచిత్రప్రశ్న వేశారు. దాంతో అసలుఘట్టమే మొదటికి వచ్చింది. రామారావు సోమవారం రాలేదు, ఇవ్వాళ బుధవారంగూడా

రాలేదు. మధ్య మంగళవారం కాలేజీ కసలు వచ్చాడా? ఇదీ ఆయన వేసిన ప్రశ్న.

ఈ ప్రశ్న విని శిక్షించాలనేవాళ్లిద్దరూ నిర్ఘాంతపోయారు. ఆనాడు వాళ్లిద్దరి క్లాసుల్లోనూ అతనున్నాడు. వాళ్లు తమ కళ్లతో తాము చూశారు. తమ పుస్తకాల్లో అతని నెంబరు ఆబ్సెంటుగా వేసుకోలేదు. ఈమాటే గట్టిగా చెప్పారు వాళ్లు.

కొత్తప్రశ్న వేసినాయన తొందరలో ఈ సంగతి ఊహించలేదు. తన పుస్తకంలో వాడి నంబరు వేసుకుంటే సరిపోతుందిగదా అనుకున్నాడు. ఇప్పుడడ్డంతిరిగి తనదే పొరపాటని తేలే స్థితి వచ్చింది. పచ్చివెలక్కాయ గొంతు కడ్డుపడ్డట్టయి 'నా క్లాసులో లేదుకాబట్టి కాలేజీకే రాలేదనుకున్నాను. వచ్చినా, రాకపోయినా జరిగినదానికి వాడేం చెప్తాడో మన మింతవరకూ తెలుసుకోలేదు. పెద్దపెద్ద కేసుల్లోనే ముద్దాయివాఙ్మూలం తీసుకోకుండా శిక్షగూర్చి ఆలోచించరు. అందుచేత వాడు వచ్చేవరకూ మన మేనిశ్చయమూ చెయ్యకూడదు'అని ఆయన ఎంతో నైపుణ్యంతో ప్రతిపాదించాడు. ప్రిన్సిపాలు దాన్ని కాదనడానికి వీలులేకపోయింది. అంచేత ఆనాటి కంతటితో సభ అయిపోయింది.

నిజానికి రామారావానాడు కాలేజిలో తిరుగుతూనేఉన్నాడుగాని కాలేజికిమాత్రం రానట్టే లెక్క. ఎంచేతంటే అతను క్లాసులకు వెళ్లడమే లేదు. అంచేతనే ప్రిన్సిపాలు పంపిన కబురు అతని కందడం లేదు. ఆయనకు కనబడకుండా, తన్ను శిక్షించాలని యత్నిస్తున్న అధికారసంఘసభ్యుల కంట బడకుండా అతను కాలేజివరండా లన్నింట్లో తిరుగుతూ 'ఏంచేస్తారో చూస్తా'మంటున్నట్లు స్వప్రతాపం ప్రకటించుకుంటున్నాడు. అతన్ని చూచి ఇంచుమించు కుర్రాళ్లందరూ పరదేశప్రభుత్వాన్ని ధిక్కరించి సత్యాగ్రహాలూ, శాసనోల్లంఘనాలూ చేసి చేయించిన జాతీయవీరులకంటే తమలో గొప్ప వాణ్ణిగా భావించుకుంటున్నారు.

ఆడపిల్లల గదిలో లీల—అసలే సుకుమారమైన ప్రాణి, రెండుపూటలనుంచీ అన్నం తినకపోవడంవల్ల శరీరం అవశమైయున్నా అవకాశంకోసం వెయ్యి కళ్లతో నిరీక్షిస్తూకూర్చుంది.

కాని రామారావు ఆరోజల్లా అవ్వైపే పోలేదు.

౫

మర్నాడుకూడా లీల పట్టిన పట్టు విడవకుండా నిరాహారగానే కాలేజికి వెళ్లింది. అధికారసంఘం అతన్ని శిక్షించి పంపించివేస్తుందా, సరేసరి. లేదూ, తానే అతన్ని శిక్షిస్తుంది! అవసరమయితే తాను గూడా కాలేజి మానివేస్తుంది. అదీ ఆమెపట్టు! తెలిస్తే కథ అంతటితోపాటు ఆమెబావ కీ సంగతి కూడా తెలియాలి. అదీ ఆమెఆశయం!

ఆనాడు రామారావు కాలేజికి వచ్చాడు. ప్రిన్సిపాలు కబురుపంపిస్తే అతను నిర్భయంగా పైఅధికారి కింది ఉద్యోగస్థుణ్ణి తనిఖీచెయ్యడానికి వెళ్లినట్లు వెళ్లాడు. అతను చేస్తున్న కొంటిచేష్టలన్నీ తమ చదువులకు ఆటంకం కలిగిస్తున్నాయని భావించే విద్యార్థులు కొందరున్నా వాళ్లసంఖ్య గణనలోకి రాదుకాబట్టి కాలేజిఅంతా రామారావుఅఖండవిజయాన్ని ఆశిస్తూ మహోత్కంఠతో ఎదురుచూస్తోందనే చెప్పాలి.

రామారావునీ, అతని బలగాన్నీ ఆనాడు ప్రిన్సిపాలు ప్రత్యక్షంగా చూచాడు.

'ఏమయ్యా!' అని సంబోధించకతప్పిందికాదు ఆయనకి.

'ఇదుగో కంప్లెయింటు! చేసింది నిజమేనా?' అన్నాడు ప్రిన్సిపాలు ఆ జాగ్రత్తతోనే.

అతను రెండునిమిషాలు దానివంక చూచి—'రామరామ! నే నాపూట కాలేజికే రాలేదండి!' అన్నాడు.

'మరి వీళ్లిద్దరూ వచ్చినట్టు చెప్తున్నారే!

'వాళ్ల క్లాసులు ఉదయం అండి. నేను రాంది మధ్యాహ్నమండి.'

అప్పుడు మంగళవారం మధ్యాహ్నం మొదటి గంట ఇంటర్మీడియేటు మూడోగ్రూపుతరగతికి ఇంగ్లీషు పాఠంచెప్పిన మాష్టారి రిజిష్టరు వచ్చి అతను రానట్లు సాక్ష్యం చెప్పింది. ఇందులో ఆ మాష్టరులాలూచీ ఏమీలేదు. రామారావు ఆ క్లాసులో ఉన్నా తాను హాజరుచెప్పలేదు, తనవాళ్లను చెప్పనియ్యలేదు. ఆ ఇంగ్లీషుమాష్టరు ఇతని ముఖం గుర్తించి ఫలానా అని చెప్పగలిగేటంత పాతవాడు కాదు. అంచేతే ఆ క్లాసులో అల్లా చేస్తే తన సరదా తీరుతుందని

అతను పథకం వేసుకున్నాడు. ఆ పథకం అనుకున్నట్టు అక్షరాలా నెరవేరింది. ఇక అతన్ని ఎంతమంది ఏకమైమాత్రం ఏం చెయ్యగలరు ?

రామారావువిజయవార్త క్షణాలమీద కాలేజి అంతా పాకిపోయింది. ఆవార్త వెళ్లివెళ్లి ఆడపిల్లల గదిలో అశనిపాతంలాపడింది. కాని పాదలాఉన్న అందులోనుంచి తోకతొక్కిన ఆడుతాచులా, తన్ను పట్టుకుంటున్న లలితనుగూడా తప్పించుకుని, లీల చఱ్ఱున దూసుకువచ్చింది.

ఏ అఘాయిత్యం చేస్తుందో అని లలిత ఆమె వెంబడే పరిగెత్తింది. ఆదారిలో దుష్టమండూకం పడలేదుగాని పడితే కాటుపడేదే !

లీల సరాసరి ప్రిన్సిపాలుగదిలోకి వెళ్లిపోయింది. ఆమె నిలబడలేకపోతోంది. లలిత పక్కకు వెళ్లి ఆమెను పట్టుకున్నది.

'ఏం చేశారు ?' అన్నది లీల.

ఆ గొంతులో తన సంఘానికంతటికీ జరిగిన అవమానానికి ఆమె పడుతున్న ఆవేదన, విడిచిన నిట్టూర్పుతో కలిసి వెచ్చగా ధ్వనించింది.

ప్రిన్సిపాలు ఆమెలో తీవ్రతను చూచి తప్పు చేసినవాడిలా బెంబేలు పడిపోయాడు.

లీల తన్నుతాను నిలద్రొక్కుకుని 'నేను టీ. సీ. అడగడానికి రాలేదు. అడగదలుచుకోలేదుకూడా ! కాని మీరు విడిచిపెట్టేసిన ఆ ద్రోహిని నేనే శిక్షిస్తాను.....................' అని బలహీనపు కంఠంతో, పట్టరాని ఆవేశంతో ఏమేమో అనబోతోంది.

అంతలో లలిత 'లీలా !'అంటూ ఆమెను తన రెండుచేతులతోనూ పట్టుకుని బలవంతాన గుమ్మంవైపు దారితీసింది. కాని వెళ్తూవెళ్తూ లీల, 'నాకు శిక్షగా మీరే ఇద్దురుగాని టీ. సీ. అది చేతనవుతుందిగా !' అన్నమాటలు ప్రిన్సిపాలుచెవులకు శూలాల్లా తగిలాయి.

౬

ఆ సాయంత్రం కాలేజిసభాభవనంలో ఆంధ్ర సారస్వతసంఘంయాజమాన్యాన 'స్త్రీస్వాతంత్ర్యం అవసరము'అన్న విషయాన్ని గూర్చి కుర్రాళ్లల్లో అతిరథమహారథు లందరూ చర్చ సలపడానికి సమావేశమయ్యారు.

సభమాట జ్ఞాపకంఉన్నా, జరిగిన పరాభవాన్ని భరించలేక నీరసంగా ఉన్న లీలను తీసుకుని హాస్టలుకు వెళ్లిపోవాలని లలిత ప్రయత్నిస్తే 'నువ్వు మాట్లాడాలి. సభ అయ్యేదాకా నేనుండాలి'అని లీలే మొండిపట్టు పట్టింది. ఆమెమనసులో ఏ ఉద్దేశం ఉందో తెలియదుగాని ఆమెపట్టుఫలితంగా, స్త్రీల స్వాతంత్ర్యాన్ని గూర్చి అంతమంది పురుషవరేణ్యులు చర్చించబోతున్న ఆ సభలో, వాళ్లిద్దరైనా స్త్రీలుండడం తటస్థించింది.

సాధారణంగా కాలేజీల్లో విద్యార్థు లేర్పాటు చేసే వైజ్ఞానికసభలకు కుర్రాళ్లెక్కువమంది రారు. కాని ఆనాడు చాలామంది వచ్చారు. దానికి రెండు మూడు కారణా లున్నాయి. వాటిల్లో రామారావు విజయాన్నికూడా పేర్కోవచ్చు. తమ నాయకుడు గెల్చాడు; అతనిపక్షంవాళ్లిందులో అనేకులు పాల్గొంటున్నారు. అంచేత ఆ సభ ఒకవిధంగా వాళ్లదే అయింది. అంతే కాదు. నాయకుడితర్వాత నాయకుడంతటివాడు అధ్యక్షత వహిస్తున్నాడు. ఇదొక హేతువు. తర్వాత బలవత్తరమైన హేతువు ఆనాటి చర్చనీయాంశం. అందులో తమాషా చెయ్యడానికిగాని, కులాసా అనుభవించడానికిగాని ఎంతైనా అవకాశం ఉంది. వీటన్నింటికంటే ముఖ్యమైందిమరొకటుంది. అది ఆనాటి సభలో మాట్లాడడానికి లలిత ఒప్పుకోవడం.

ఏమయితే నేం, ఇంచుమించు కాలేజిఅంతా ఆనాటి సభలో ఉన్నట్టే అయింది.

సభాప్రారంభసమయం సన్నిహితమైనా, అనివార్యకారణాలవల్ల ఆహూతులైన అధ్యక్షులు రాలేదు. వారు రారన్న సంగతి నిర్వాహకులకు మధ్యాహ్నమే తెలిసింది. ఆ స్థానం ఆక్రమించవలసిన వ్యక్తిని గూర్చి ఇంతకుముందే వాళ్లు నిర్ణయించుకున్నారుగూడా. ఆ సంగతి ఆడపిల్లలకు తెలియదుగాని తక్కిన కాలేజి అంతటికీ తెలుసు.

అనుకున్న వేళయి అరగంట గడిచాక కార్యదర్శి లేచి రావలసిన అధ్యక్షులు రాలేదనీ, అందుచేత కృష్ణమూర్తిగారి నా స్థానం స్వీకరించవలసిందని కోరుతున్నాననీ సభాముఖంలో అన్నాడు. ఈ అధ్యక్షవరణం కుర్రాళ్లకు పరమహర్షాన్ని కలిగిస్తే అక్కడున్న లీలాలలితలకు క్షణకాలం తీవ్రబాధ కలిగించింది. మొన్న జరిగిన సంఘటనలో ఈ వ్యక్తిసహకారంగూడా ఉన్నది. అంచేత లలిత ఆమాట వినసం

తోనే ‘మనం వెళ్లిపోదా’మన్నది లీలతో. కాని ఆమె ‘ఏమైనా సరే ఉందాం! వాళ్లు మీరిప స్తే మనం తెగిద్దాం’అని పట్టుపట్టుకు కూర్చుంది.

కృష్ణమూర్తి అధ్యక్షాసనం అలంకరించాడు. సభలో కరతాళధ్వనులు చెత్తరేగిపోయాయి.

అధ్యక్షులు, తమ భావం చర్చానంతరం చెప్పడం భావ్యంకాబట్టి సభ నరసింహంతో ప్రారంభ మైంది.

అతను కుర్రాళ్లకు ప్రేమపాత్రుడైన మరో నాయకుడు. అందుచేత అతను మాట్లాడినంతసేపూ మెప్పుదల సూచిస్తూ చప్పట్లు కొట్టి చప్పుడు చేస్తున్నా సభ నిశ్శబ్దంగానే ఉంది. ముందువరసలోనే లలిత పక్కన కూర్చున్న లీల చక్షుశ్శ్రీవమై అన్నివైపులా, ప్రతిమూలా చూస్తూనే వింటోంది.

‘మనదేశంలో మన పూర్వులు స్త్రీలకు స్వాతంత్ర్యం లేకుండాచేసి వాళ్లను కేవలం వంటయింటి బానిసలుగా ఉపయోగించుకున్నారు. అంతకంటే అన్యాయం మానవజాతిచరిత్రలోనే మరొకటి కనిపించదు. ఈ రోజుల్లో విద్యార్థులమైన మనం— అంటే భావిభారతపౌరుల మన్నమాట—అలాంటి పాతఉసిరికాయభావాలు పెంచుకుంటే ఎందుకూ పనికిరాం. మనదేశం బాగుపడాలంటే స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలి. స్త్రీ అంటే ఎవరు? మీరూ, నేనూ, ఇక్కడ ఉండే యావన్మందీ స్త్రీదయవల్లనే ఆవిర్భవించారు. అల్లాంటి ఆదిశక్తికి స్వాతంత్ర్యం అక్కర్లేకపోవడమేమిటి? వద్దంటే మాత్రం మానుతుందా? స్త్రీలకే స్వాతంత్ర్యం లేకపోతే మన కాలేజిలాంటి కాలేజీలకు అందం ఏముంది, ఆనందం ఏముంది? అంచేత స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండితీరాలి!’ నరసింహంఉపన్యాసం ఇల్లా సాగిపోతోంది. పోనుపోను హర్షధ్వానాలు ఎక్కువైపోయి ఆ తర్వాతిభాగం ఉటంకించడానికి వీలుకాకుండా చేశాయి.

అతని తరువాత మరినలుగురు పురుషులు మాట్లాడారు. వాళ్లల్లో ఇద్దరు తీర్మానానికి వ్యతిరేకంగా మాట్లాడాలని ప్రయత్నించారుగాని చేతకాక మొత్తానికి తాత్పర్యంలో అనుకూలతనే ప్రకటించారు.

చిట్టచివరికి లలితవంతు వచ్చింది. ఆమె వేదిక దగ్గరకు వెళ్తున్నంతసేపూ సభికుల మనసుల్లో ఏభావం ఉన్నదో తెలియదుగాని వట్టి చేతులచప్పట్లు కాక బల్లలమీది ధ్వనులు ఆమెఅడుగులతో లయకలిపి చిత్రమైన చర్మదారువాద్యం సాగించాయి. ఆ వాద్యధ్వనిలో కలిసిపోయి స్పష్టాస్పష్టంగా ‘ఎమజాన్, స్టడీ, నాయకురాలు, ఉపన్యాసకురాలు’ ఇత్యాది వందిగణపాఠాలుగూడా వినిపించాయి. ఆమె వీటి నన్నింటినీ లక్ష్యంచెయ్యక ధైర్యంగా వేదికమీదికి వెళ్లి ఒక్కసారి సభవంక చూచేసరికి మొదట్లో ఆదిమానవచేష్టావిశేషాలు కనిపించినా తర్వాత తర్వాత ‘ఏమిటి మీరిచ్చే స్వాతంత్ర్యం? సగౌరవంగా స్త్రీని చూడలేని చచ్చుయువకులు స్వాతంత్ర్యం ఇస్తారుట!’, అంటూ మహావేశంతో అందుకోగానే కల్మషహృదయాలు చిల్లులుపడుతున్నా ఆమె వ్యథితహృదయంలోనుంచి లావాద్రవంలా వచ్చిదూకుతున్న ఉపన్యాస ప్రవాహంలోపడి ఏమీ చెయ్యలేక సభ స్తబ్ధమైపోయింది.

లలిత మొదలుపెట్టేవరకూ ఆ ప్రదేశం అణువణువూ చూస్తూ వింటున్న లీల అప్పటినుంచీ వింటూ చూడ్డం మొదలుపెట్టింది.

ఆ పూట లలిత అయిదునిమిషాలే మాట్లాడింది. అయినా సభ అట్టుడికినట్టుడికింది. చాలామందికి ఆమె నక్కడే హతమార్చెయ్యా లన్నంత కోపంగూడా వచ్చింది. కాని లీలాలలితలు సభకు వెళ్తున్నారన్న సంగతి తెలిసి ఈపూట మరేమైనా జరుగుతుందేమో అని భయపడి సభలో కూర్చోకపోయినా కాలేజిలోనే ఉండి ప్రిన్సిపాలు ఇద్దరుముగ్గురు లెక్చరర్లతో చుట్టుపక్కల తిరుగుతూ నేఉండడం ఏం చెయ్యడానికీ వీల్లేకుండా వాళ్ల కోపాన్ని అణిచివేసింది.

అప్పటికే కాలాతీతమైంది. అధ్యక్షులు తమ వాగ్దానాన్ని ఉపసంహరించుకుని తీర్మానం ఓటుకు పెట్టారు. స్త్రీస్వాతంత్ర్యం కావాలన్నవాళ్లు చేతు లెత్తాలనడంతో ఆసభలో ఇద్దరుతప్ప తక్కిన వాళ్లందరూ వ్యతిరేకంగా మాట్లాడిన లలితమీది కోపంతో ఉన్న చేతులన్నీ ఎత్తారు.

తీర్మానం గెలిచింది. సభ అయిపోయింది.

ఆచరణలో పరాభవం పొందిన లీల ప్రతీకార దృష్టితో చూచిచూచి విసుగెత్తి చిట్టచివరి క్షణాల్లో

తనకు తెలియకుండానే నీరసంచేత బల్లమీద వాలి కన్నుమూసింది.

లలిత ఆమెను మెల్లగా తట్టింది. ఆమె ఉలిక్కిపడి లేచింది. కాస్తవుంటే లలితను కొట్టేసేదే! కాని ఆమె కంఠస్వనిని విని 'నువ్వా?' అన్నది లీల. 'నేనే' అంటూ లలిత ఆమెను దగ్గరకు తీసుకుని హాస్టలువైపు దారితీసింది.

సభకు వచ్చిన కుర్రాళ్లందరూ లలితనుగూర్చి నానామాటలూ అనుకుంటూ ఆ దారిలోనే ముందు వెళ్తున్నారు. చాలా వెనకఉన్న లీలాలలితలకు ఆ మాటలు వినిపించడంలేదు.

దారిపొడుగూతా ఎలెక్ట్రికుదీపాలు ఉన్నా మధ్యమధ్య స్తంభాలకు బల్బులులేక చీకటిపట్టులు తరుచూ వస్తున్నాయి. అలాంటి చోట్లల్లో కూడా లీలకళ్లల్లోని క్రోధాగ్ని స్ఫులింగాలతో ఎదుటబడ్డ వస్తువులు కనిపిస్తూనేఉన్నాయి.

కాలేజి దాటి వాళ్లింకా ఫర్లాంగైనా పోలేదు. మరోఫర్లాంగు పోతేగాని హాస్టలు రాదు.

అంతలో ఎవరో సిగరెట్టువెలుగులో ముఖాన్ని చూపించి చటుక్కున చీకట్లో మాయమయ్యారు. ఆ చీకటి పట్టు తక్కినవాటికంటే కొంచెం పెద్దది. ఒకరిమీద ఒకరు చేతులు వేసుకొని లీలాలలితలు ఆపట్టున మెల్లగా నడుస్తున్నారు.

చీకటిపోయి మళ్లీ వెలుగువచ్చింది. కాని వెనకాల ఏదో కాళ్లచప్పుడు వినిపించి. లీల గిరుక్కున తిరిగింది. ఎదురుగా రామారావు!

అతిసాహసంతో వాళ్లదగ్గరకే అడుగులు వేస్తున్నాడు. ఇందాకా ముందువైపున చీకట్లో కనిపించి మాయమైంది కూడా అతనే! తాను చేసిన పనికి ప్రిన్సిపాలంతటివాడు పట్టుపట్టికూడా శిక్షవెయ్యలేకపోవడం అతని కెక్కడలేని మత్తునూ కలిగించింది. ఆ మత్తుతోనే అతను హాయిగా ఆరింటికే భోజనంచేసి, అరగంటసేపు నీటుగా వేషంవేసుకుని, బజారులోకి వచ్చి ఘుమాయించి సువాసనకొట్టే మంచికిళ్లీ ఒకటి కులాసాగా వేసుకుని, దర్జాగా సిగరెట్టుకాలుస్తూ సరదాకోసం కాలేజిహాస్టలుదగ్గరకు వెళ్లాడు. ఇంకా మీటింగు కాలేదనీ, కుర్రాళ్లు రాలేదనీ అక్కడికి వెళ్లాక అతనికి తెలిసింది. అల్లాగయితే కాలేజీకే వెళ్దామని బయలుదేరాడు. దారిలో సభనుంచి వస్తున్న కుర్రాళ్లు కనిపించారు. వాళ్లు చెప్పిన వేవీ అతని బుర్ర కెక్కలేదుగాని రెండుసంగతులుమాత్రం తెలిశాయి. తక్కిన ఆడపిల్ల లెవ్వరూ సభకు రాలేదు. వత్సలమ్మ తోడు లేకుండానే లీలా, లలితా వెనకాల వస్తున్నారు. ఇంకేం కావాలి? అతని మనస్సు ఆనందసముద్రమే అయిపోయింది. ఏసముద్రానికైనా ఉప్పెన తప్పదు. స్వాదుత్వంలేని ఆజలం అసాధువై చెలియలికట్టను దాటుతుంది. అందుకనే రామారావు ముందుకుపోయాడు. చీకట్లో మెల్లగా తప్పుకొని వాళ్లవెనక జడ్డాడు.

లీల గిరుక్కున తిరిగి రామారావును చూచి అరనిమిషమయినా కాలేదు. ఆమె ఛఫ్ఘున వెళ్లి అతన్ని నిలవేసి 'ఇదిగో స్త్రీస్వాతంత్ర్యం! మీస్నేహితులంతా కలిసి ఇచ్చారు. అంటే ఏమిటో తెలుసా? వెనకనుంచి జడలాగడం కాదు. ముందుండి మూతిపళ్లు రాలగొట్టడం!' అంటూనే ఆమె లలితతో కలిసి వెళ్లిపోయింది.

కాని దూరాన ముందుపోతున్న కుర్రాళ్లు హడలుపుట్టి పారిపోయారు.

అయిదువేళ్లూ అంటి ఎఱ్ఱగా కందిన రెండుచెంపల్నీ బాధతో తడుముకొంటూ, గుడ్లవెంబడి నీళ్లతో దీపంవెలుగున నిలబడిఉన్న రామారావుశరీరాన్ని వెనకాల సహోద్యోగులతో వస్తున్న ప్రిన్సిపాలు చూచిగూడా తలవంచుకుని చూడనట్టే వెళ్లిపోయాడు.